క్లుప్తంగా

రోడ్డుపై గుంతల పూడ్చివేత



గుంతలను పూడ్చిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు వరహాలు

రావికమతం: వైఎస్సార్‌సీపీ నాయకుడు వరహాలు సొంత నిధులతో రోడ్డుపై గుంతలను పూడ్చివేయించారు. కవగుంటలో కొన్ని నెలలుగా గ్రానైట్ లారీలు తిరగడం వల్ల పెద్ద పెద్ద గోతులు ఏర్పడ్డాయి. ఇటీవల అకాల వర్షాలకు నీరు నిలిచిపోయి వాహన చోదకులకు తీవ్ర ఇక్కట్లు పడుతున్న నేపథ్యంలో గ్రామ సర్పంచ్ సూర్యకుమారి భర్త వరహాలు ఆదివారం దగ్గరుండి గుంతల్లో మట్టి వేయించి పూడ్చివేయించారు.

మోటారు బాగు చేయించిన గ్రామస్తులు

- అధికారులకు కార్యదర్శి ఫిర్యాదు



మోటారు బాగుచేయించుకున్న గ్రామస్తులు

రావికమతం: మత్స్యపురంలో మంచినీటి పథకం మోటారు పాడై పది రోజులుగా నెలకొన్న తాగునీటి ఇక్కట్లను గ్రామస్తులు పరిష్కరించుకున్నారు. మోటారు పాడైందని బాగుచేసి తాగునీటి సరఫరా చేయాలని పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదు. దాంతో గ్రామస్తులు చందాలు వేసుకుని రూ.10 వేలతో మోటారు బాగు చేయించి తాగునీటి సమస్యను పరిష్కరించుకున్నారు. ఈ మోటారుకు వారంటీ ఉన్నప్పటికీ తమకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా ప్రైవేటు వ్యక్తులతో బాగు చేయించారని, ప్రభుత్వ ఆస్తులకు నష్టం కలిగించినందున పంచాయతీ కార్యదర్శి కోటేశ్వరరావు అధికారులకు ఫిర్యాదు చేశారు.

ఘనంగా పైడితల్లమ్మ ఆలయ ప్రారంభోత్సవం



అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

కె.కోటపాడు: పిండ్రంగి గ్రామంలో నూతన పైడితల్లమ్మ అమ్మవారి ఆలయ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ అమ్మవారి విగ్రహ ప్రతిష్టాపనోత్సవాన్ని నిర్వహించారు. గ్రామస్తులతోపాటు పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో అన్నసమారాధన ఏర్పాటు చేశారు.

'మోడల్'లో ప్రవేశానికి దరఖాస్తులు

నర్సీపట్నం: వేములపూడి ఏపీ మోడల్ స్కూల్‌లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కె.సంధ్యారాణి తెలిపారు. 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి 6వ తరగతిలో ప్రవేశానికి అర్హత కలిగిన విద్యార్థులు ఈ నెల 25వ తేదీ లోపు http://apms.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. జూన్ 11వ తేదీన రాత పరీక్ష ఉంటుందన్నారు. ఆన్‌లైన్ అప్లికేషన్లు పాఠశాలల్లో అందజేయాలని సూచించారు.

సండే సందడి



తిక్కవానిపాలెం తీరంలో సందర్శకులు

పరవాడ: తిక్కవానిపాలెం తీరం ఆదివారం సందర్శకులతో కిటకిటలాడింది. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన పర్యాటకులు జీడి తోటలు, చెట్ల నీడన, టెంట్లు, వంతెన దిగువ కాలక్షేపం చేశారు. సాయంత్రం ఇసుక తిన్నలపై కబడ్డీ, వాలీబాల్, క్రికెట్ వంటి ఆట పాటలతో ఎంజాయ్ చేశారు. సాయంత్రం తీరంలో జలకాలాటలతో సరదాగా గడిపారు.

మన్యం వీరునికి ఘన నివాళి



నివాళులర్పిస్తున్న గిరిజనులు



రోలుగుంట: అల్లూరికి నివాళులర్పించిన వైస్ ఎంపీపీ సన్యాసినాయుడు, సంఘ సభ్యులు



అల్లూరి సీతారామరాజు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

రావికమతం: అల్లూరి పోరాట పటిమ ఎందరికో ఆదర్శనీయమని ఆదివాసీ గిరిజన సంఘం నాయకుడు సెగ్గే శ్రీను, పలు గ్రామాల గిరిజనులు తెలిపారు. అల్లూరి సీతారామరాజు వర్ధంతి సందర్భంగా కె.గదబపాలెంలో మహనీయుడి విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనకాపల్లి జిల్లాలోని 29 మైదాన ప్రాంత గిరిజన గ్రామాలను అల్లూరి సీతారామరాజు జిల్లాలో విలీనం చేసి ఐటీడీఏ నిధులు వర్తింపచేయాలని కోరారు. కొత్తకోటలోనూ అక్కడి నాయకుడు కిశోర్ తదితరులు అల్లూరి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

కుసుర్లపూడిలో..

రోలుగుంట: బ్రిటిష్ వారిని గడగడలాడించిన అల్లూరి సీతారామరాజు పోరాట పటిమ స్ఫూర్తిదాయకమని వైస్ ఎంపీపీ కొల్లు సన్యాసినాయుడు, సబ్బవరపు పెద్దినాయుడు తెలిపారు. కుసుర్లపూడిలో కేతిరెడ్డి సుధాకర్‌నాయుడు తన కుటుంబీకులతో నిర్మించిన అల్లూరి సీతారామరాజు విగ్రహం వద్ద ఆదివారం పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అల్లూరి సీతారామరాజుకు ఆశయాలు సాధిద్దాం.. అల్లూరికి జోహార్.. జోహార్ అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో అప్పలసీతయ్యనాయుడు, న్యాయవాది పాల్గొన్నారు.

నాతవరం: మండలంలో అల్లూరి సీతారామరాజు వర్ధంతి ఆదివారం నిర్వహించారు. అల్లూరి సీతారామరాజు నడయాడిన ప్రాంతమైన సరుగుడు గిరిజన గ్రామంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టరు బండి గంగరాజు అల్లూరి చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. నాతవరంలో అమ్మ వాసవీ సేవా సంఘం మండల శాఖ అధ్యక్షురాలు ఇట్టంశెట్టి అక్కయ్యమ్మ, సంఘం కార్యదర్శి పేరూరి బుల్లిదొర అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండల వ్యాప్తంగా అల్లూరి విగ్రహాలకు స్థానిక ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థ సభ్యులు పూలమాలలు వేసి వర్ధంతి వేడుకలు నిర్వహించారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా మనమంతా నడుచుకోవాలని కోరారు.

నర్సీపట్నం: క్షత్రియ పరిషత్ ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు 99వ వర్ధంతిని నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని అల్లూరి విగ్రహానికి క్షత్రియ పరిషత్ అధ్యక్షుడు శ్రీరామరాజు, టెజ్రర్ సతీష్ రాజు, చక్రపాణిరాజు, ప్రసాద్‌రాజు, రవి వర్మ, రామచంద్రరాజు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆర్డీవో కార్యాలయానికి ఎదురుగా మెయిన్ రోడ్డుపై అల్లూరి విగ్రహానికి సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి మాకిరెడ్డి రామునాయుడు తదితరులు పూలమాలలతో శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గురుబాబు, క్రాంతి, ఏఐటీయూసీ నాయకుడు ఎల్.రమణ, సీనియర్ లాయర్ ప్రకాష్, నూకరాజు, సత్తిబాబు పాల్గొన్నారు.

యువతకు అల్లూరి స్ఫూర్తిదాయకం

చోడవరం: అల్లూరి సీతారామరాజు స్ఫూర్తితో యువత అన్ని రంగాల్లో ముందుకు నడవాలని మండల పరిషత్ అధ్యక్షురాలు గాడి కాసు తెలిపారు. స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు వర్ధంతిని స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మహనీయుడి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మంగ జగన్నాథరావు, మండల పరిషత్ సిబ్బంది, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

మాకవరపాలెం: విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు వర్ధంతి సందర్భంగా తామరంలో అల్లూరి విగ్రహానికి తూర్పుకాపు సంఘం మండలాధ్యక్షుడు గొంతిన హరిబాబు, పీఏసీఎస్ డైరెక్టర్ డి.అయ్యన్న పూలమాలలు వేసి నివాళులర్పించారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద మహనీయుడి విగ్రహానికి మాజీ ఎమ్మెల్సీ పి.వి.ఎన్.మాధవ్, బీజేపీ మండల నేతలు పూలమాలలతో శ్రద్ధాంజలి ఘటించారు.



చోడవరంలో అల్లూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎంపీపీ గాడి కాసు



తామరంలో నివాళులర్పిస్తున్న హరిబాబు, తదితరులు



ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని అల్లూరి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న క్షత్రియ పరిషత్ నాయకులు

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక



కె.జె.పురం హైస్కూలులో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

మాడుగుల రూరల్: కె.జె.పురం జిల్లా పరిషత్ హైస్కూలులో పూర్వ విద్యార్థులు ఆదివారం సందడి చేశారు. ఇక్కడ 2004–2005 విద్యా సంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసిన 60 మంది విద్యార్థులు అదే స్కూలులో ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆట పాటలతో కాలక్షేపం చేశారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఈ బ్యాచ్ గతంలో పలు ఆధ్యాత్మిక, ధార్మిక కార్యక్రమాలు చేపట్టింది.

ఎస్‌సీఈఆర్టీ డైరెక్టర్ దృష్టికి ఉపాధ్యాయ సమస్యలు



ప్రతాప్‌రెడ్డిని సన్మానిస్తున్న పీఆర్టీయూ అధ్యక్షుడు గోపినాథ్, ఉపాధ్యాయులు

నర్సీపట్నం: రాష్ట్ర విద్యా పరిశోధన, శిక్షణా మండలి (ఎస్‌సీఈఆర్టీ) డైరెక్టర్ ప్రతాప్‌రెడ్డిని పీఆర్టీయూ ఉపాధ్యాయులు సన్మానించారు. ఆదివారం నర్సీపట్నం విచ్చేసిన ఆయన్ను పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు డి.గోపినాథ్, జి.వి.రమేష్, అల్లు అప్పారావు, బాబి తదితరులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు.

ఘనంగా ఎం. కోడూరు మోదమాంబ పండగ

డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ప్రత్యేక పూజలు



ఎం. కోడూరులో మోదమాంబను దర్శించుకుంటున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

మాడుగుల రూరల్: ఎం. కోడూరులో మోదమాంబ అమ్మవారి పండగ ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అమ్మవారిని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. సర్పంచ్ గొల్లవిల్లి సంజీవి రావు, ఎంపీపీ వేమవరపు రామధర్మజ, వైస్ ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకటరాజారామ్, దేవరాపల్లి జెడ్పీటీసీ కర్రి సత్యం, మాడుగుల సర్పంచ్ యడ్ల కళావతి, తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు. సాయంత్రం నుంచి వివిధ కూడళ్లలో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. గ్రామస్తులతోపాటు చుట్టు పక్కల గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

కొత్తూరులో వైభవంగా రామాలయం ప్రతిష్ట

దేవరాపల్లి: బోయిలకింతాడ పంచాయతీ శివారు కొత్తూరులో కోదండరామ స్వామి సహిత సీతారాముల ఆలయ ప్రారంభం, విగ్రహ ప్రతిష్ట మహోత్సవం ఆదివారం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ వేడుకల్లో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు పాల్గొని సీతారాముల వారిని దర్శించుకుని భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. అనంతరం ఆయన్ను ఘనంగా సత్కరించారు. జెడ్పీటీసీ కర్రి సత్యం, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు, స్థానిక సర్పంచ్ బూరె బాబూరావు, మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు తదితరులు సీతారాముల వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా విగ్రహ ప్రతిష్ట అనంతరం భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో భారీ అన్నసమారాధన ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కొత్తూరు గ్రామ పెద్దలు, ప్రజలు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేటి నుంచి వేసవి విజ్ఞాన శిబిరాలు

కె.కోటపాడు: మండలంలోని చౌడువాడ, కె.కోటపాడు శాఖా గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరాలను నిర్వహించనున్నట్లు గ్రంథపాలకులు ఎం.పద్మావతి, సౌమ్య తెలిపారు. వీటిని సోమవారం నుంచి జూన్ 11 వరకూ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఇందులో భాగంగా పుస్తక పఠనం, పుస్తక సమీక్షలు, చిత్రలేఖనం, పేపర్ ఆర్ట్ తదితర అంశాలను వివరించి, విజ్ఞానాన్ని పెంపొందించే చర్యలను తీసుకోనున్నట్లు తెలిపారు.

నేడు వేచలంలో 'గడప గడపకు'

దేవరాపల్లి: వేచలంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు సోమవారం నిర్వహిస్తారని వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు బూరె బాబూరావు తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి ప్రతీ ఇంటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిని వివరించి, ప్రజా సమస్యలను అడిగి తెలుసుకుంటారన్నారు. ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి, జెడ్పీటీసీ కర్రి సత్యం, అన్ని శాఖల అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారన్నారు.

జీవకారుణ్యం సంఘ భవన నిర్మాణానికి భూమిపూజ

రూ.5 లక్షలు మంజూరు చేసిన ఎమ్మెల్యే ధర్మశ్రీ



భవన నిర్మాణ స్థలంలో పూజ చేసి పనులు ప్రారంభించిన సంఘ సభ్యులు

రోలుగుంట: స్థానిక జీవకారుణ్యం సంఘ భవన నిర్మాణానికి సంఘ సభ్యులు ఆడారి గణేష్ చోప్రా, సుర్ల సత్తిబాబు, తమరాన సత్యనారాయణ ఆదివారం భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. తొలుత జేఈ ఉమామహేశ్వరుడు ఇక్కడ స్థలాన్ని పరిశీలించి సచివాలయ ఇంజినీర్ సాయితో నిర్మాణానికి అవసరమైన విధంగా మార్కింగు చేశారు. 90 ఏళ్ల క్రితం స్థానికంగా 15 కుటుంబాల వారు జీవకారుణ్య సంఘం ఏర్పాటు చేసుకుని వారి సొంత నిధులతో భవనం నిర్మించుకున్నారు. కీర్తిశేషులు సుర్ల దేముళ్లు, ఆడారి నాయుడు, బండారు భాస్కరరావు, కొట్టే అప్పలనాయుడు, తమరాన పోతురాజు, మడ్డు గైరమ్మ సత్యం తదితర సంఘ సభ్యుల కుటుంబాల వారు మాంసాహారానికి స్వస్తి చెప్పి శాఖాహారం తీసుకునే సంప్రదాయం కొనసాగిస్తూ.. పలు సామాజిక సేవలు చేసేవారు. కొన్నేళ్ల క్రితం ఈ భవనం శిథిలావస్థకు చేరుకుంది. దీనికి నిధులు మంజూరు చేయాలని కోరుతూ గత నెల గ్రామంలో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ దృష్టికి జెడ్పీటీసీ పోతల లక్ష్మీ రమణమ్మ, సంఘం అధినేత మడ్డు గైరమ్మ సత్యం, సంఘ సభ్యులు వినతిపత్రం అందజేశారు. దీనిపై ఆయన స్పందించి రూ. 5 లక్షలు మంజూరు చేశారు. ఈ భవన నిర్మాణం పనులు ప్రారంభం కావడంతో జీవకారుణ్య సంఘం సభ్యుల కుటుంబాలు, వీరికి సహకారం అందిస్తున్న యవకులు ప్రభుత్వ విప్ ధర్మశ్రీకి, జెడ్పీటీసీకి కృతజ్ఞతలు తెలిపారు.

తొలగిన రహదారి కష్టాలు

- నాగయ్యపేట-కడకొండ గ్రామాలకు తారురోడ్డు
- రూ.1.25 కోట్లతో నిర్మాణం
- డిప్యూటీ సీఎం బూడి చొరవ



నాగయ్యపేట-కడకొండ మధ్య నిర్మించిన తారురోడ్డు



కొంత మేర రక్షణ గోడతో నిర్మించిన సీసీ రోడ్డు

దేవరాపల్లి: డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ప్రత్యేక చొరవతో మండలంలోని నాగయ్యపేట ఎస్సీ కాలనీ నుంచి విజయనగరం జిల్లా వేపాడ మండలం వావిలపాడు పంచాయతీ శివారు కడకొండ మట్టిరోడ్డును తారురోడ్డుగా నిర్మించారు. ఈ రోడ్డు నిర్మించాలన్న దశాబ్దాల కల నెరవేరడంతో ఈ ప్రాంత ప్రజలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. రూ.1.25 కోట్లతో 1.4 కిలోమీటర్ల మేర నిర్మించారు.

అనకాపల్లి, విజయనగరం జిల్లాల మధ్య వారధిగా రోడ్డు.....

గతంలో ఈ మార్గంలో మోకాలు లోతు బురదనీటిలో రాకపోకలు సాగించి నానా అవస్థలు పడేవారు. ఇక్కడి రహదారి కష్టాలను డిప్యూటీ సీఎం దృష్టికి నాగయ్యపేట వైఎస్సార్‌సీపీ నాయకులు తీసుకెళ్లారు. వెంటనే స్పందించి నిధులు మంజూరు చేయించారు. దాంతో రెండు జిల్లాలను అనుసంధానిస్తూ నిర్మించిన ఈ రోడ్డు అనకాపల్లి జిల్లా దేవరాపల్లి మండలం, విజయనగరం జిల్లా వేపాడ మండల ప్రజలకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది. గతంలో వేపాడ మండలం చేరుకోవాలంటే వావిలపాడు మీదుగా 15 కిలోమీటర్ల మేర ప్రయాణించి వెళ్లేవారు. ప్రస్తుతం ఈ రోడ్డు నిర్మాణంతో 11 కిలోమీటర్ల ప్రయాణించి చేరుకోవచ్చు. దేవరాపల్లి మండలానికి ఆనుకున్న అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలానికి చెందిన గిరిజన గ్రామాల ప్రజలకు వేపాడ మీదుగా ఎస్.కోట, అనంతగిరికి రాకపోకలు సాగించేందుకు సౌలభ్యంగా ఉంటుంది. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎంకు దేవరాపల్లి, వేపాడ మండల ప్రజలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

రోడ్డు కష్టాలు తప్పాయి



నాగయ్యపేటకు చెందిన రైతుల కల్లాలు కడకొండకు సమీపంలో ఉన్నాయి. మేమంతా అక్కడకు వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు పడేవాళ్లం. డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు చొరవతో రహదారి కష్టాలు తప్పాయి.

–వంటాకు పైడితల్లమ్మ, ఎంపీటీసీ, నాగయ్యపేట

వంద మీటర్ల మేర నిర్మించాలి



నాగయ్యపేట ఎస్సీ కాలనీ నుంచి కడకొండ సరిహద్దు వరకు 1.4 కిలోమీటర్ల మేర తారురోడ్డు నిర్మాణానికి డిప్యూటీ సీఎం బూడి ముత్యానాయుడు రూ. 1.25 కోట్లు మంజూరు చేశారు. ఈ నిధులతో తారురోడ్డుతోపాటు 360 మీటర్ల మేర సీసీరోడ్డు, 300 మీటర్ల రక్షణ గోడను నిర్మించాం. బీటీరోడ్డు వెడల్పు 3.75 మీటర్లు కాగా, బెర్మ్‌లతో కలిపి 7.50 మీటర్ల రోడ్డు వెడల్పు ఉంటుంది. ఇంకా వంద మీటర్ల మేర బీటీరోడ్డు నిర్మించాల్సి ఉంది. రెండు రోజుల్లో పూర్తి చేస్తాం.

– కె. ఉమామహేశ్వరరావు, పంచాయతీరాజ్, ఏఈ, దేవరాపల్లి

నాతవరం హైస్కూల్ చరిత్రలో రికార్డు

- పదిలో 75 మందికి ప్రథమ శ్రేణి



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం శివరాంప్రసాద్, ఉపాధ్యాయులు

నాతవరం: స్థానిక హైస్కూల్‌లో పదో తరగతి పరీక్షల ఫలితాల్లో 75 మంది విద్యార్థులు ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులై చరిత్ర సృష్టించారు. ఇదే హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు కోమ్మోజు పవన్‌కార్తీక్‌కు 587 మార్కులు, ఎన్.కుమార్ 569 మార్కులు సాధించారు. ఈ ఏడాది 137 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 110 మంది ఉత్తీర్ణత సాధించారు. 550పైగా ముగ్గురు, 500పైగా మార్కులు సాధించిన వారిలో 11 మంది ఉన్నారు. వీరిని హెచ్‌ఎం శివరాంప్రసాద్ అభినందించారు. గునుపూడి హైస్కూల్ విద్యార్థి పి. పవన్‌సాయి 571 మార్కులు సాధించాడు. మర్రిపాలెం కేజీబీవీలో 85 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఈ స్కూల్‌లో ఎస్. హర్షిత 561, జి.సుమిత్ర 555 మార్కులతోపాటు పలువురు ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులయ్యారు. వీరిని కేజీబీవీ ప్రత్యేకాధికారి భవాని అభినందించారు.

- **ఆంగ్ల మాధ్యమంలోనూ మెరుగైన ఫలితాలు**

చోడవరం రూరల్: పదో తరగతి పరీక్షల్లో 580 మార్కులు సాధించిన శీలం సాయి శ్రీవల్లి లక్కవరం జెడ్పీ బాలికోన్నత పాఠశాల పేరు నిలిపిందని పేరెంట్స్ కమిటీ చైర్మన్ దేవరపల్లి కుమారి సంతోషం వ్యక్తం చేసింది. అంభేరుపురంలో శ్రీవల్లి ఇంటికి స్వయంగా వెళ్లి విద్యార్థినితోపాటు తల్లిదండ్రులను అభినందించారు. తమ పాఠశాలలో 569 మార్కులతో గూనూరు షర్మిల, మరికొందరు విద్యార్థులు 500 పైబడి మార్కులు సాధించడం తమ ఉపాధ్యాయుల కృషి ఫలితమేనన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సమకూర్చిన సౌకర్యాలు, పదో తరగతి ఉత్తీర్ణతను పెంచడానికి చేపట్టిన ప్రణాళికలు బాగా ఉపకరించాయని అభిప్రాయపడ్డారు.



శ్రీవల్లిని అభినందిస్తున్న కమిటీ చైర్మన్ కుమారి

జుత్తాడ జెడ్పీ ఉన్నత పాఠశాలలో తెలుగు మాధ్యమంలో 12 మంది పరీక్షలు రాయగా పది మంది ఉత్తీర్ణులయ్యారు. ఈ పాఠశాలలో అత్యధికంగా 90 శాతం ఉత్తీర్ణతను సాధించి మండలంలో టాప్‌లో నిలిచింది. వేమాల పూజిత(553 మార్కులు) కాళ్ల తేజస్విని(530) పాఠశాలలో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారు. వీరిని ప్రధానోపాధ్యాయుడు ఓ.సీతబాబు, కమిటీ చైర్మన్ బి.శ్రీనివాసరావు అభినందించారు. లక్కవరం ఉన్నత పాఠశాలలో ఆంగ్ల మాధ్యమంలో 76 శాతం ఉత్తీర్ణత సాధించారు. గోవాడ పాఠశాలలో ఆరుగురు విద్యార్థులు 500 పైబడి మార్కులను సాధించారు. 96 మంది పరీక్షలు రాయగా 79 మంది ఉత్తర్ణులయ్యారు. డెక్కల సాగర్(552), దొడ్డి పుష్ప(529), ఏడువాక ధనలక్ష్మి(523), బండి గీతాంజలి(516), కవలలు కర్రి సింధు(511), కర్రి సుధ(507) మార్కులు సాధించారు. లక్కవరం ఉన్నత పాఠశాలలో 553 మార్కులతో ఒక విద్యార్థి ప్రథమ స్థానంలో నిలవగా మరో పది మంది విద్యార్థులు 500 పైబడి మార్కులను సాధించారు. గవరవరం ఉన్నత పాఠశాలలో సాయిశ్రీ(577), ద్రాక్ష(553), జ్యోత్స్న (536), సునీత (509), ఎ.పూజిత(502), కె.ప్రీతి(500) మార్కులను సాధించారు.

నిజాలు నిర్భయంగా రాయాలి

- డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

మాడుగుల: విలేకరులు ప్రజా క్షేత్రంలోకి వెళ్లి వాస్తవాలు వెలికితీసి ప్రజా సమస్యలు పరిష్కరించే దిశగా పని చేయాలని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు అన్నారు. ఆదివారం స్థానిక కల్యాణ మండపంలో మాడుగుల ప్రెస్‌క్లబ్ 25వ వార్షికోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జర్నలిస్టుల సమస్యలపై సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. అనంతరం ప్రెస్‌క్లబ్ సభ్యులు ఆయనకు మోదకొండమ్మ జ్ఞాపిక అందజేసి, శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ వేమవరపు రామధర్మజ, సర్పంచ్ ఎడ్ల కళావతి, ఉప సర్పంచ్ శ్రీనాథు శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ దంగేటి సూర్యారావు, మోదకొండమ్మ ఆలయ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు పాల్గొన్నారు.

టెన్త్‌లో ప్రతిభ విద్యార్థులకు అభినందన

దేవరాపల్లి: పదో తరగతి పరీక్ష ఫలితాల్లో గ్రామీణ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించడం అభినందనీయమని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు అన్నారు. ఈ మేరకు పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన ఓ ప్రైవేటు స్కూల్ విద్యార్థులు తారువ క్యాంప్ కార్యాలయంలో ఆదివారం ఆయన్ను కలిశారు. నియోజకవర్గంలోనే అత్యధిక మార్కులు సాధించిన పోతల భానుచందర్, తుంపాల బాలాజీ, గేదెల హర్షిత, ఆడారి సుధలను శాలువాతో సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, స్కూల్ కరస్పాండెంట్ ఎస్. అప్పలనాయుడు పాల్గొన్నారు.

హిందూ ధర్మ పరిరక్షణకు కృషి



సమావేశంలో పాల్గొన్న ధర్మ ప్రచారక్ సాయిరాం

పరవాడ: హిందూ ధర్మాన్ని రక్షించే బాధ్యత గ్రామ ధార్మిక జట్లపై ఉందని సమరసత సేవా ఫౌండేషన్ రాష్ట్ర ధర్మ ప్రచారక్ ముద్దు సాయిరాం అన్నారు. వాడచీపురుపల్లి కల్యాణ మండపంలో ఆదివారం నిర్వహించిన ఫౌండేషన్ విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. దేవాలయాల కేంద్రంగా పౌర్ణమి రోజు సామూహిక హారతి, ఏకాదశికి నగర సంకీర్తన, వారానికి ఒక సారి భజన, ఇంటింటా ధర్మ ప్రచారం గ్రామాల్లో నిర్వహించడం ద్వారా భక్తి భావం పెంపొందించడం సాధ్యపడుతుందని సూచించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు ఆడారి గంగాధర్, కర్రి రాజు, దాసరి రాము, వెన్నల అప్పలనాయుడు, బీసీ సంక్షేమ సంఘ పెందుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి కూండ్రపు కృష్ణంనాయుడు, ప్రతినిధులు ఉమామహేశ్వరి, వెంకునాయుడు, కె.అప్పలనాయుడు, లాలం ఈశ్వరరావు పాల్గొన్నారు.